క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణుడికి పూజలు



సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని గార్లపాడు బస్టాప్ సెంటర్‌లో గల గీతా మందిరంలో శనివారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణుడిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. స్వామి వారికి 108 గిన్నెల్లో నైవేద్యం సమర్పించారు.

మాదల పీఏసీఎస్ అధ్యక్షుడిగా అయ్యప్ప



మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల పీఏసీఎస్ అధ్యక్షుడిగా మాదల గ్రామానికి చెందిన తిరుమలశెట్టి అయ్యప్ప నియమితులయ్యారు. వీరితో పాటుగా బొల్లవరానికి చెందిన కంది రామిరెడ్డి, ఇరుకుపాలేనికి చెందిన బత్తుల వెంకటేశ్వర్లు సభ్యులుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన రాష్ట్ర జల వనరులశాఖ మంత్రి అంబటి రాంబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాల ద్వారా రైతులకు అందించే అన్ని రకాల ప్రోత్సాహకాలను అందించేందుకు తనవంతు కృషి చేస్తానని అయ్యప్ప చెప్పారు. అయ్యప్పను గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందించారు.

సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఆర్థిక సాయం



క్రోసూరు: సమగ్ర శిక్షలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మండల ఉపాధ్యాయులు శనివారం ఆర్థిక సాయం అందజేశారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో ఉపాధ్యాయుల తరపున రూ.70,500లు ఎంఈఓ ఏకుల ప్రసాదరావు అందించారు. ఈ కార్యక్రమంలో మండల ఫ్యాప్టో నాయకులు పాల్గొన్నారు.

కోడి పందేల నిర్వాహకుల అరెస్ట్

నకరికల్లు: కోడి పందేల నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ ఎ.బాలకృష్ణ శనివారం తెలిపారు. నకరికల్లు రిజర్వాయర్ సమీపంలో దాడులు నిర్వహించి, తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని, ఒక కోడిపుంజు, రూ.1,130 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

కుంటలో పడి యువకుడు గల్లంతు

అమరావతి: ఎండ్రాయి గ్రామ పరిధిలోని కుంటలో పడి యువకుడు గల్లంతైన ఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు.. మాచర్ల మండలం కొత్తూరు గ్రామానికి చెందిన జానపాటి వీరాంజి గొర్రెలు మేపుకోవటానికి పది రోజుల క్రితం మందతో ఎండ్రాయి కొండ దగ్గరకు చేరుకున్నాడు. ప్రతి రోజు మేతమేసిన గొర్రెలకు కుంటలో నీరు తాగిస్తుంటాడు. ఈ క్రమంలో అక్కడికి వెళ్లిన వీరాంజి ప్రమాదవశాత్తు కుంటలో పడి, మునిగిపోయాడు. ఈ విషయమై గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. స్థానిక ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. అయితే యువకుడి ఆచూకీ లభించలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా కొండ మట్టి తవ్వకాలు జరపడంతో.. భారీ కుంటలు ఏర్పడ్డాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

పతంగుల విహంగంలో జాగ్రత్తలు తప్పనిసరి

గురజాల : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని గాలి పటాలు ఎగురవేసే సమయంలో పలు జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ శాఖ ఏఈ మస్తాన్ వలి సూచించారు. తన కార్యాలయంలో శనివారం ఆయన పలు సూచనలు చేశారు. విద్యుత్ తీగలపై పడిన పతంగులను జాగ్రత్తగా తీయాలని, తొందరపడొద్దని హెచ్చరించారు.

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం

దుర్గి: మండల కేంద్రంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ 70వ వార్షికోత్సవం సందర్భంగా కల్యాణ మహోత్సవాలకు గ్రామస్తులు పూర్తి ఏర్పాట్లు చేశారు. ఆదివారం మంగళ వాయిద్యాలతో సుప్రభాత సేవ, అభిషేకం, స్వామి వారి కల్యాణం, నంది వాహన సేవ, ముగ్గుల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

సంక్రాంతి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి



సత్తెనపల్లిలో భోగి ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

- రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- సత్తెనపల్లి గాంధీ చౌక్ సెంటర్‌లో భోగి ఏర్పాట్ల పరిశీలన

సత్తెనపల్లి: సంక్రాంతి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లి పట్టణంలోని గాంధీ చౌక్ సెంటర్‌లో ఆదివారం తెల్లవారుజామున వేయనున్న భోగి మంటల ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ.. వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీలు నిర్వహించి, మహిళలకు నగదు బహుమతులతో పాటు ప్రోత్సాహక బహుమతులు 12,916 మందికి అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. నియోజకవర్గ ప్రజల ఆనందం కోసం భోగినాడు తాను విలయ తాండవం చేస్తానని, గిట్టని వాళ్లు తనపై ఎన్నో విమర్శలు చేస్తున్నప్పటికీ లెక్కచేయనని మంత్రి అంబటి స్పష్టం చేశారు. ఆయనతో పాటు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చలంచర్ల సాంబశివరావు, వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దేవతి సుబ్బారావు, హైదరాబాద్ సుభాని తదితరులు ఉన్నారు.

లోక రక్షకుడు.. ఏసుక్రీస్తు

ఏసుక్రీస్తు లోక రక్షకుడని, పాపులను రక్షించేందుకు ఆయన ఈ లోకానికి వచ్చారని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. గుడిపూడి ఎస్సీ కాలనీలో లూథరన్ చర్చి నిర్మాణానికి శనివారం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి అంబటి రాంబాబు భూమి పూజ చేసి, లూథరన్ చర్చి నిర్మాణానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. చర్చి నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా కమిటీ చూసుకోవాలని చెప్పారు. బిషప్ బాబురావు, పాస్టర్లు బాబురావు, రవి, సంఘ కాపరి నీలం యాకోబు దైవ సందేశం అందించి, ప్రార్థన చేశారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, పార్టీ మండలాధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, వ్యవసాయ సలహా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయ భాస్కరరెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంతోనే అసలైన సంక్రాంతి



భోగి మంట వేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, వసంతకుమారి దంపతులు

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్రోసూరు: పెదకూరపాడు నియోజకవర్గంలో నాలుగున్నరేళ్లలో ఎవరూ ఊహించని అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. జరిగిన అభివృద్ధి, అందిన సంక్షేమంతోనే ప్రజలు అసలైన సంక్రాంతి పండుగ చేసుకుంటున్నారన్నారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, ఆయన సతీమణి వసంతకుమారి క్రోసూరులో శనివారం ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన వేడుకల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. భోగి మంటలు వేసి ఆనందాన్ని పంచుకున్నారు. చిన్నారులకు ఎమ్మెల్యే దంపతులు భోగిపండ్లు పోసి, ఆశీర్వదించారు. ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ.. పెదకూరపాడు నియోజకవర్గ ప్రజలు తనను కుటుంబంలో ఒకడిగా చూసుకుంటున్నారన్నారు. వారి ఆదరాభిమానాలే గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపించాయన్నారు. అప్పటి నుంచి నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కష్టపడుతుతున్నానని, మరోసారి తనను నమ్మి గెలిపిస్తే.. పెదకూరపాడును అభివృద్ధికి కేరాఫ్‌గా మారుస్తానన్నారు. ప్రజల ప్రేమానురాగాల మధ్య సంక్రాంతి సంబరాలు చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని నంబూరు వసంతకుమారి అన్నారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు ప్రజల మధ్య ఉండడమే ఇష్టమని తెలిపారు. అందుకే సంక్రాంతి పండగను ఇలా ప్రజల మధ్య చేసుకుంటున్నారన్నారు.

ముగ్గుల పోటీల్లో విజేతలు..

ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతి 88 త్యాళ్లూరుకు చెందిన చెన్నా దేవి రూ.40 వేలు గెలుచుకున్నారు. రెండో బహుమతిగా దొడ్లేరుకు చెందిన వల్లూరి పద్మలత రూ.25 వేలు, క్రోసూరుకు చెందిన యర్రం రెడ్డి వెంకటరమణ మూడో బహుమతి రూ.15 వేలు, బోరుగడ్డ సౌందర్య నాలుగో బహుమతిగా రూ.10 వేలు, కావూరి పరిమళ ఐదో బహుమతిగా రూ.5 వేలు గెలుచుకున్నారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దంపతులు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. క్రోసూరు వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి హైస్కూల్ వరకు అభిమానులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు గీతా వసంతి, సర్పంచ్ మల్లా చందమామ, పార్టీ మండల నాయకులు వెలది అప్పారావు, ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ షేక్ జమీలా గఫూర్, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, గార్లపాటి దాసు, అనుముల కోటిరెడ్డి, వెలుగు ఏపీఎం షేక్ సలీం, మాజీ జెడ్పీటీసీ పెదబాబు నాయకులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణం వేగంగా పూర్తిచేయాలి

అమరావతి: పెద మద్దూరు బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆదేశించారు. శనివారం హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులను ఆయన సందర్శించారు. అమరావతి నుంచి తుళ్లూరు వరకు డబుల్ లేన్ రోడ్డుకు రూ.44 కోట్ల నిధులు మంజూరైనట్లు చెప్పారు. ప్రయాణికుల ఇక్కట్లను గమనించి పెద మద్దూరు వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం వేగంగా పూర్తిచేయాలని అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. అధిక వర్షాలు, తుపానుల కారణంగా నీరు ఎక్కువగా రావడంతో బ్రిడ్జి నిర్మాణ పనుల్లో జాప్యం జరిగిందన్నారు. అనంతరం పెద మద్దూరులో బాల ఏసు దేవాలయం తృతీయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే నంబూరు పాల్గొన్నారు. చర్చి ఫాదర్ కరుణాకరరెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేసి, దీవెనలు అందించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, జేసీఎస్ అధ్యక్షుడు నాయుడు రాంబాబు పాల్గొన్నారు.

ధనుర్మాసం..దివ్య సమ్మోహనానందం



వడ్డవల్లిలో స్వర్ణ అలంకారంలో శ్రీవారు



పెద్దమక్కెనలో ప్రత్యేక అలంకరణలో శివలింగం

సత్తెనపల్లి: ధనుర్మాసం పురస్కరించుకొని పట్టణంలోని ఆలయాల్లో శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వడ్డవల్లి శ్రీ రామాలయం వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారికి స్వర్ణ, కోదండ రామస్వామికి శ్వేతవర్ణ అలంకరణలు గావించారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారికి దివ్య సమ్మోహనానంద రూప అలంకరణ గావించారు. ఐదులాంతర్ల సెంటరులోని రుక్మిణి సత్య భామ సమేత వేణుగోపాలస్వామి, కట్టమూరివారి వీధిలోని కోదండ రామాలయం, పెద్ద మక్కెన గంగా భ్రమరాంభ సమేత మల్లికార్జున స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయాల కమిటీలు ఏర్పాట్లను పర్యవేక్షించాయి.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



నకరికల్లు: ధనుర్మాసం పురస్కరించుకొని దేచవరం గ్రామంలో గోదాదేవి, మహాలక్ష్మి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణ వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామివారి కల్యాణ వేడుక కనుల పండువగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

కోడి పందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు

సత్తెనపల్లి డీఎస్పీ ఆదినారాయణ



సత్తెనపల్లి: సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు, పేకాట వంటి జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణ హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో సీఐలు, ఎస్ఐలు, సిబ్బందిని జూదాల కట్టడికి ఆదేశించామన్నారు. సంప్రదాయ క్రీడలను నిర్వహించుకోవాలన్నారు. కోడి పందేలు, పేకాట, జూదం, గుండాట నిర్వహించడం నిషేధమన్నారు. ఇలాంటి వాటిని ఎక్కడైనా ఆడినా, ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కోడి పందేలు, జూదం, పేకాట నిర్వాహకులను ఇప్పటికే బైండోవర్ చేయాలని అన్ని పోలీస్ స్టేషన్లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పట్నంబజారు: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన సంఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పల్నాడు జిల్లా పెదకూరపాడు గ్రామానికి చెందిన కంచర్ల విజయబాబు (40) ఈనెల 10న ఇంట్లో వారితో పురుగు మందులు తీసుకొస్తానని చెప్పి గుంటూరు వచ్చాడు. 11వ తేదీ ఉదయం గుంటూరువారితోటలోని మాధవి రెసిడెన్సిలో రూము తీసుకుని ఉన్నాడు. 12వ తేదీ సాయంత్రం అయినప్పటికీ తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చిన లాడ్జి నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించారు. తలుపులు పగులగొట్టి లోపలకు వెళ్లి చూడగా విజయబాబు కిందపడి మృతిచెంది ఉన్నాడు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. మృతుడి భార్య ప్రమీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ముత్యాలమ్మ తిరునాళ్ల

రాజుపాలెం: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి, భక్తుల పాలిటి కొంగు బంగారం ముత్యాలమ్మతల్లి. అనుపాలెం తూర్పు వైపున కొండపై కొలువుదీరిన అమ్మవారి తిరునాళ్లను ప్రతి సంక్రాంతికి ఘనంగా నిర్వహిస్తారు. ఆదివారం అమ్మవారి తిరునాళ్ల నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. పాడి పంటలు, భోగభాగ్యాలతో చల్లగా చూసే తల్లికి కులమతాలకు అతీతంగా తొలి ధాన్యపు కంకులు, పొంగళ్ల నైవేద్యంగా భక్తులు సమర్పిస్తారు. చీరా సారెలతో బోనాలు నెత్తిన పెట్టుకొని మొక్కులు తీర్చుకుంటారు. సాయంత్రం విద్యుత్ ప్రభలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తిరుణాళ్లలో అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా ఎస్ఐ షేక్ అమీరుద్దీన్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ప్రభలపై రాజకీయ పార్టీల జెండాలు, ఫ్లెక్సీలు, అశ్లీల చిత్రాలు ప్రదర్శించవద్దని హెచ్చరించారు.



శ్రీముత్యాలమ్మ తల్లి మూలవిరాట్

ముగిసిన మండల స్థాయి 'ఆడుదాం ఆంధ్రా' ఆటలు

సత్తెనపల్లి: 'ఆడుదాం ఆంధ్రా' సత్తెనపల్లి రూరల్ మండల స్థాయి క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, ఖోఖో, బ్యాడ్మింటన్ ఆటల పోటీల్లో బాల బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. కబడ్డీ బాలుర విభాగంలో నందిగామ-1, బాలికల విభాగంలో కొమెరపూడి, వాలీబాల్ బాలుర విభాగంలో గుడిపూడి, బాలికల విభాగంలో కొమెరపూడి, బ్యాడ్మింటన్ బాలుర విభాగంలో కొమెరపూడి, బాలికల విభాగంలో కంకణాలపల్లి, ఖోఖోలో బాలుర విభాగంలో నందిగామ-1, బాలికల విభాగంలో కొమెరపూడి, క్రికెట్ బాలుర విభాగంలో ధూళ్ళిపాళ్ల జట్లు విజయం సాధించాయి. ఈ జట్లుకు సత్తెనపల్లి పట్టణంలో గెలుపొందిన జట్లతో ఈ నెల 18, 19న పోటీలు నిర్వహించి, నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపనున్నారు. గెలు పొందిన జట్లను ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, మండల చీఫ్ కోచ్ ఆరిక శ్రీరామిరెడ్డి, నందిగామ ఫిజికల్ డైరెక్టర్ లాకు పిచ్చియ్య, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసరావు, క్రీడాకారులు ఉన్నారు.



ధూళ్ళిపాళ్ల క్రికెట్ జట్టుతో పీడీ పిచ్చియ్య, పీఎస్ శ్రీనివాసరావు

చెరువులకు జలకళ

కారెంపూడి: సాగర్ కుడి కాల్వకు మంచి నీటి విడుదలతో మండలంలో చెరువులు ఇప్పుడిప్పుడే జలకళ సంతరించుకుంటున్నాయి. సోమవారం నుంచి కారెంపూడి సబ్ డివిజన్ పరిధిలోని చెరువులకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారని ఓఅండ్ఎం కారెంపూడి సబ్ డివిజన్ ఏఈ బత్తిన నరేంద్ర శనివారం తెలిపారు. ప్రస్తుతం ఒంగోలు, నర్సరావుపేట ప్రాంతాలకు నీరు వెళ్తోందని.. అక్కడ చెరువులకు నీరు చేరుకోగానే పల్నాడు ప్రాంతంలోని చెరువులు నింపుకునేందుకు పూర్తిస్థాయి నీటి విడుదల చేయాలని ఆదేశాలున్నట్లు తెలిపారు. సాగర్ నీటి విడుదల 18న నిలిపివేసినా.. బుగ్గవాగు నుంచి 22వ తేదీ వరకు నీరు వచ్చే అవకాశం ఉందన్నారు. మంచినీటి అవసరాల కోసం ప్రతి చెరువును నింపాలన్నదే లక్ష్యమన్నారు. ప్రస్తుతం మేజర్ కాల్వల ద్వారా నీటి సరఫరా ఒక మోస్తరుగా కొనసాగుతోంది.



ఒప్పిచర్ల నల్ల చెరువు

రెంటచింతల ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

రెంటచింతల: స్థానిక ఎస్ఐగా కె.వెంకటనారాయణరెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో ఈ సందర్భంగా మాట్లాడారు. గ్రామాల్లో కోడి పందేలు నిర్వహిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ, సీపీఐ నాయకులు ఆయనను కలిసి, శుభాకాంక్షలు తెలియజేశారు.

విజయపురిసౌత్ ఎస్ఐగా వెంకట కొండారెడ్డి

విజయపురిసౌత్: నాగార్జున సాగర్, విజయపురిసౌత్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా డి.వెంకట కొండారెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. 2018 బ్యాచ్‌కు చెందిన ఆయన బాపట్లలో ఎస్ఐగా పనిచేశారు. గత ఎస్ఐ పి.అనిల్ కుమార్‌రెడ్డి బదిలీపై డిస్ట్రిక్ట్ స్పెషల్ బ్రాంచ్‌కు వెళ్లారు. స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఎస్ఐ వెంకట కొండారెడ్డి అన్నారు. ఆయనకు పోలీస్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

మాచర్ల రూరల్: సంక్రాంతి పండగ నేపథ్యంలో గ్రామాల్లో కోడి పందేలు, పేకాట ఇతర జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని రూరల్ ఎస్ఐ కె.రాజశేఖర్ హెచ్చరించారు. శనివారం రూరల్ పోలీసు స్టేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసు స్టేషన్ పరిధిలో పలు గ్రామాల్లో ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో రాజకీయ చర్చలు, పార్టీలతో కూడిన ప్రచారాలు చేయటం పూర్తిగా నిషేధమన్నారు.

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య

తెనాలిరూరల్: భార్య కాపురానికి రావడంలేదని భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన పొన్నాల సుబ్బారావు(34)కు స్థానిక పాండురంగపేటకు చెందిన శివపార్వతితో వివాహమైంది. భార్య కొంతకాలంగా కాపురానికి రావటం లేదు.దీంతో ఇరు కుటుంబాల వారు తరచూ గొడవపడుతుండేవారు.

ఈ క్రమంలో శుక్రవారం రాత్రి అత్తింటికి వచ్చిన సుబ్బారావు భార్యను కాపురానికి రమ్మని గొడవపడ్డాడు. కాపురానికి వచ్చేందుకు భార్య నిరాకరించడంతో అత్తింట్లోనే రాత్రికి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం ఉదయం సమాచారం అందుకున్న త్రీ టౌన్ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బతుకులు మారాలంటే.. మళ్లీ జగనే రావాలి



కోటేశ్వరరావుకు పింఛను అందజేస్తున్న సర్పంచ్ వెంకట్రావు

అచ్చంపేట: 'మాలాంటోళ్ల బతుకులు బాగుపడాలంటే ముఖ్యమంత్రిగా మళ్లీ జగనే రావాలి' అంటూ మాదిపాడుకు చెందిన దివ్యాంగుడు రెడితి కోటేశ్వరరావు ఆనందం వ్యక్తం చేశారు. ఆయనకు నూతనంగా మంజూరైన దివ్యాంగ పింఛనను శనివారం సర్పంచ్ మాదా వెంకట్రావు, వలంటీరు బలరాం గుప్తా అందజేశారు. ఇంటి నుంచి కదల్లేని తనకు ఎవరి సిఫార్సు లేకుండా పింఛను మంజూరు చేయించడం, సర్పంచ్‌తో సహా ఇంటికి వచ్చి అందించడం చాలా సంతోషంగా ఉందని కోటేశ్వరరావు అన్నారు. ముఖ్యమంత్రి జగన్ బాబుకు ఎంతో రుణపడి ఉంటామన్నారు. సచివాలయ కన్వీనర్ కొరివి మంగమ్మ, ఆర్య వైశ్య సంఘ జిల్లా కార్యదర్శి దేవరశెట్టి శ్రీనివాసరావు, జిల్లా మైనార్టీ సెల్ కార్యాదర్శి షేక్ కరిముల్లా, గృహసారథి అల్లాబక్షు, మాజీ ఎంపీటీసీ వెన్నా శ్రీనివాసరెడ్డి తదితరులున్నారు.

సంక్రాంతికి రహదారి రద్దీ



దాచేపల్లి : సంక్రాంతికి హైదరాబాద్ నుంచి స్వగ్రామాలకు భారీగా ప్రజలు వాహనాల్లో బయలుదేరారు. శనివారం అద్దంకి-నార్కెట్‌పల్లి హైవే వాహనాలతో రద్దీగా మారింది. ఏపీ సరిహద్దు గ్రామం పొందుగల వద్ద అధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. పండగ రోజు వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో రోడ్డు కిక్కిరిసింది. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగటంతో ప్రయాణికులు కొంత ఇబ్బందులు పడ్డారు.